
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 271 ఎడిటర్: కె.యువరాజ్ శనివారం 11-7-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు





హైదరాబాద్, జులై 11 (వన్‌నేషన్): కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించారని తెలిపారు. సచివాలయంలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు.

కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి


3లో




హైదరాబాద్, జులై 11 (వన్‌నేషన్): భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక సువర్ణ అధ్యాయం ముగిసింది. తన మధురమైన గాత్రంతో కొన్ని దశాబ్దాల పాటు కోట్ల మంది ప్రేక్షకులను మైమరపించిన లెజెండరీ సింగర్, గానకోకిల ఎస్. జానకి (88) ఇకలేరు. కొద్దిసేపటి క్రితమే మైసూర్ లో ఆమె మరణించారు. ఈ విషయాన్ని జానకి మనవరాలు అప్సర వైద్యుల సోషల్ మీడియా వేదికగా తెలిపారు. దీంతో ఇండస్ట్రీలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. 'నా ప్రియమైన అమ్మమ్మ, లెజెండరీ సింగర్ శ్రీమతి ఎస్. జానకి గారు కన్నుమూశారని తీవ్ర విచారంతో పంచుకుంటున్నాను. కుటుంబ సభ్యుల ప్రేమ మధ్య ఆమె ప్రశాంతంగా చివరి శ్వాస విడిచారు. ప్రస్తుతం మా హృదయాలు భారంగా ఉన్నప్పటికీ.. ఆమె జీవించిన అసాధాంఇమైన జీవితానికి, తన అమర సంగీతం ద్వారా కోట్ల మందికి అందించిన అపరిమితమైన ఆనందానికి మేము ఎంతో కృతజ్ఞతతో

3లో

# చంద్రబాబు మూడు జిల్లాల పర్యటన



రాజమహేంద్రవరం, జులై 11 (వన్‌నేషన్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈ నెల 13న వరుసగా మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేటు పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలు, సూచనలను స్వయంగా తెలుసుకోనున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం.. ఈ నెల 13న ఉదయం 10:25 గంటలకు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసం నుంచి సీఎం చంద్రబాబు హెలికాప్టర్‌లో బయలుదేరనున్నారు. ఉదయం 11 గంటలకు తూర్పు గోదావరి జిల్లా వేమగిరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 11:10 గంటలకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కు చేరుకుంటారు. అనంతరం ఉదయం 11:25 గంటలకు బ్యారేజ్ నంబర్-1 గేటు పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం తర్వాత 11:50 గంటలకు ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద రైతులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి వారికి దిశానిర్దేశం చేయనున్నారు. రైతులతో సమావేశం అనంతరం మధ్యాహ్నం 12:55 గంటలకు ముఖ్యమంత్రి తిరిగి వేమగిరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలికాప్టర్‌లో ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి బయలుదేరి వెళ్తారు. అక్కడ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు సంబంధిత అధికారులతో సమావేశం కానున్నారు.




## అశ్వినీ వైష్ణవ్

హైదరాబాద్, జులై 11 (వన్‌నేషన్): దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. 'బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుంది. నరేంద్ర మోదీ.. బడ్జెట్‌లో తెలంగాణకి నిధులు పెంచారు. యూపీఏ ప్రభుత్వం 800 కోట్ల రూపాయలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తే.. మేము తెలంగాణకు 5000 కోట్ల రూపాయలు ఇచ్చాము' అని అన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు
# భుజం సర్జరీ విజయవంతం


అమరావతి, జులై 11 (వన్‌నేషన్): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం ముంబైలోని ఓ ఆస్పత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్థివాలా నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్సను నిర్వహించారని తెలిపారు. పవన్ కల్యాణ్‌కు రెండు భుజాల్లోనూ తీవ్రమైన రోటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు నిర్ధారించారని చెప్పారు. రోటేటర్ కఫ్ చిరగడంతో పాటు, ఆయన కుడి భుజంలో అవల్షన్ ఫ్రాక్చర్ ఏర్పడటంతో ఓ పెద్ద శస్త్రచికిత్స అవసరమైందని అన్నారు. ఆయన కుడి భుజానికి చేసిన ఈ శస్త్రచికిత్స సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగించారని.. ఈ సర్జరీ విజయవంతంగా పూర్తయిందని అధికారులు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను ఆపరేషన్ అనంతరం రికవరీ గదికి తరలించారని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అనస్థీషియా ప్రభావం నుంచి బాగా కోలుకుంటున్నారని చెప్పారు. చికిత్స అందిస్తున్న వైద్య బృందం నిశిత పర్యవేక్షణలో డిప్యూటీ సీఎం ఉన్నారని వెల్లడించారు. వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్య నిపుణులు సలహా ఇచ్చారని అన్నారు. ముందుగా తన అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని, పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకోవడానికి ముందే వాటిని పూర్తి



చేయాలని నిర్ణయించారని చెప్పారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్రచికిత్స చేయడంతో ఆపరేషన్ తర్వాత గణనీయమైన అసౌకర్యం, కదలిక పరిమితి ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ క్రమంలో వైద్య బృందం మొదట కుడి భుజానికి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించిందని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తగినంత కోలుకున్న తర్వాత ఎడమ భుజానికి శస్త్రచికిత్స చేయాలని ప్రణాళిక చేశారని అధికారులు తెలిపారు. ఆయన అవిశ్రాంత ప్రజా కార్యక్రమాలు, విస్తృత రాజకీయ పర్యటనలు, ఎన్నికల ప్రచారాలు, పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో నిరంతర సంభాషణల కారణంగా, 2016లో అయిన ఈ భుజం గాయాలు సంవత్సరాలు గడిచేకొద్దీ క్రమంగా తీవ్రమయ్యాయని వెల్లడించారు. నిరంతర నొప్పిని భరిస్తున్నప్పటికీ, ఉప ముఖ్యమంత్రి ఎలాంటి అంతరాయం లేకుండా తన అధికారిక బాధ్యతలను నిర్వర్తిస్తూ, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారని అన్నారు.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో
కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై
అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని

అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల
వ్యాప్తంగా జిల్లాలు, మండలాల
వారీగా పనిచేసే విలేకరులు
కావలెను.

9948222240

# ఆల్విన్ కాలనీ ఉమ్మడి డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా చిన్నగాలోల రాజు నియామకం

**శేర్లింగంపల్లి, జులై 11 (వన్‌నేషన్):** భారతీయ జనతా పార్టీ శేర్లింగంపల్లి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడి గా చిన్నగాలోల రాజును అధిష్టానం నియమించింది. శుక్రవారం బీజేపీ పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనివల్లి శ్రీనివాస్ రెడ్డి రాజు కి నియామక పత్రం అందజేసి అయన మాట్లాడుతూ రాజు లాంటి యువనాయకులు డివిజన్ లోని పార్టీ నాయకులతో కలిసి మెలిసి పని చేస్తూ రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో డివిజన్ లో బీజేపీ జెండా ఎగరవేయాలని తెలిపారు. పార్టీ లో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందని వివరించారు. అధ్యక్షుడు గా నియమక పత్రం అందుకున్న అనంతరం రాజు మాటాడుతూ తన పై నమ్మకం ఉంచి పార్టీ ఇచ్చిన బాధ్యతను అప్పగించినందుకు అధిష్టానానికి ధన్యవాదములు తెలిపి,తప్పకుండ నెరవేర్చి డివిజన్ లో బీజేపీ జెండా ఎగరడవేసేలా కృషి చేస్తానని తెలిపారు.



### శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ మరియు మాతా మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా

# అంబారి పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణ



**హైదరాబాద్, జులై 11 (వన్‌నేషన్):** శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ మరియు మహంకాళి దేవాలయ 104 వ బోనాల ఉత్సవాల సందర్భంగా అంబారిపై అమ్మవారి ఘటం ఊరేగింపు పై పోలీసు ఉన్నత అధికారులు DCP రాఘవేంద్ర రెడ్డి, Add DCP కృష్ణగౌడ్, ACP తిరుపతి, CI రాములు కుల్చంపుర, CI బాలకృష్ణ టప్పాచబుత్ర, ఈ కార్యక్రమానికి విజయవంతం చేయడానికి సహకరిస్తామని తెలిపారు. పూజా కమిటీ అధ్యక్షులు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి అల్లే రామ్ కుమార్ మరియు సలహాదారులు గుడబోయిన శివరత్నం, సేనాపతి చంద్రశేఖర్, కట్ట నర్సింగ్ రావు, గుడుమని అశోక్ కుమార్, గాండ్ల నిరంజన్ బాబు పాల్గొన్నారు.




# రేవంత్ రెడ్డి ఆట మొదలు పెట్టాడు

**హైదరాబాద్, జులై 11 (వన్‌నేషన్):** 117 సీట్లు గెలిపించుకునే ప్లాన్ రేవంత్ రెడీ చేశాడు. రేవంత్ వ్యూహాలు, నిర్ణయాలకు మా మద్దతు ఉంటుంది. రేవంత్ ఆలోచనలతో మాకు ఏకాభిప్రాయం ఉంటుంది. సీట్లు ఎవరికి ఇవ్వాలనే అంశం సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. అధిష్ఠానం హరీష్ పై పోటీ చేయమంటే సిద్ధమే. నేను సంగారెడ్డిలో పోటీ చేయనన్నాను కానీ వేరే దగ్గర పోటీ చేయనని చెప్పలేదు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి తెలిపారు. శనివారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ సీట్లు ఎవరికి ఇవ్వాలనే అంశం సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. ఇంత ముందు ఎన్నికల గురించి ఆలోచించడం సరైన ఆలోచనే రెండవ సారి ప్రభుత్వం తెచ్చేందుకు నిర్ణయాలు తీసుకునే హక్కు రేవంత్ కి ఉందన్నారు. ఎవరి సర్వేలు వారికి అనుకూలంగా చేస్తారు. సర్వేలను చూసి టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్యేల పనితీరు దృష్టిలో పెట్టుకునే సీఎం పలువురికి సూచనలు ఇస్తున్నారు. నేను సంగారెడ్డిలో పోటీ చేయను అన్నాను. వేరే దగ్గర పోటీ చేయనని చెప్పలేదన్నారు. సంగారెడ్డి నియోజకవర్గం లేడీ ఉన్నా, జనరల్ ఉన్నా నిర్మలనే క్యాండేట్ సీఎం సూచనలతో ఎమ్మెల్యేలు అలెర్ట్ అవుతున్నారు. సీఎం చెప్పడంతో పలువురు ఎమ్మెల్యేలు తమ తీరు మార్చుకుంటున్నారు. సీఎం చెప్పిన తర్వాత కూడా తీరు మారకపోతే సీటు ఇవ్వాలో లేదో సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయం తీసుకుంటారన్నారు. అపోజిషన్ ఎప్పుడూ రూలింగ్ పార్టీని ఎటాక్ చేస్తుందిరాజకీయ నీతి కూడా అదేకేసీఆర్ మొదటిసారి సీఎం అయినప్పుడు కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని సర్వేలు చెప్పాయి. యాక్టివ్ లేని వాళ్ళని సీఎం రేవంత్ అలెర్ట్ చేస్తున్నారు. అలెర్ట్ చేసిన తర్వాత కూడా తీరు మార్చకపోతే వేటు తప్పదు. మేమే తోపులు అంటే నడవదు. పెద్ద పెద్ద తోపులను కూడా పక్కన పెట్టిన సందర్భాలు ఉన్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే తోపు కాదు సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ మాత్రమే తోపులు రాజకీయాల్లో పర్మినెంట్ గా ఎవరూ తోపులు ఉండరన్నారు. అధిష్ఠానం హరీష్ పై పోటీ చేయమంటే సిద్ధమే అధిష్ఠానం సిద్దిపేటలో పోటీ చేయమంటే తప్పకుండా చేస్తానన్నారు.



# మూసీ ప్రాజెక్టు సంబంధించిన అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం

**హైదరాబాద్, జులై 11 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్ర లోక్ దళ్ (టీఆర్ఎల్డీ) పత్రిక ప్రకటన హోటల్ సెంట్రల్ కోర్ట్, లక్ష్మీకాపూల్. హైదరాబాద్లోని హోటల్ సెంట్రల్ కోర్ట్, లక్ష్మీకాపూల్లో మూసీ ప్రాజెక్టు మరియు దానికి సంబంధించిన అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది. శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ (టీఆర్ఎల్డీ) అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ, గౌరవ ఎంపీ శ్రీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ శ్రీ తకెళ్లపల్లి రవీందర్, ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సమావేశంలో ట్రైకార్ మాజీ చైర్మన్ శ్రీ బెల్లయ్య నాయక్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి, శ్రీ మన్నారం నాగరాజు, శ్రీ కర్నాటి మనోహర్, మాజీ ఎమ్మెల్యే శ్రీ వర్ణాల శ్రీరాములు, మాజీ ఎంబీసీ చైర్మన్ శ్రీ తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ తకెళ్లపల్లి రవీందర్ ఎమ్మెల్సీ గారు మాట్లాడుతూ లక్ష యాభై వేల కోట్ల అంచనా వ్యయంతో కూడిన ప్రాజెక్టును, జీతాలు, పెన్షన్లు కూడా సకాలంలో ఇవ్వలేని ప్రభుత్వం ఎలా చేపడుతుందని ప్రశ్నించారు. ప్రొఫెసర్ హరగోపాల్ గారు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు అసలు పబ్లిక్ హియరింగ్ నిర్వహించలేదని, ఇక నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని ఎలా విశ్వసించగలమని అన్నారు. ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ గారు మాట్లాడుతూ ప్రతి ఊరిలో మైసమ్మలు మిగిలి, కట్టలు, చెరువులు మాయమైపోయాయని, ఒకప్పుడు వరదలతో ప్రవహించిన మూసీ నది నేడు మురికికూపంగా మారిందని అన్నారు. శ్రీ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సోషియల్ ట్రీట్మెంట్ ప్లాంట్లు విరివిగా నెలకొల్పాలని, పారిశ్రామిక వ్యర్థాలను నదుల్లోకి వదలకూడదని అభిప్రాయపడ్డారు. శ్రీ మన్నారం నాగరాజు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్లోని మలక్పేట్ రేస్కోర్స్కు చెందిన 103 ఎకరాలను మూసీ నిర్వాసితులకు కేటాయించి, అక్కడ వెర్టికల్ స్ట్రక్చర్లు నిర్మించి అందరికీ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే శ్రీ వర్ణాల శ్రీరాములు మాట్లాడుతూ అందరూ మూసీ పునర్జీవ ప్రాజెక్టును స్వాగతిస్తున్నప్పటికీ, డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ లేకుండా ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై చర్చించడం కష్టమని అన్నారు. ట్రైకార్ మాజీ చైర్మన్ శ్రీ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ నిర్వాసితులకు ఆశ్రయం కల్పించకుండా, సరైన నష్టపరిహారం ఇవ్వకుండా ఈ ప్రాజెక్టును గ్రౌండ్ చేయవద్దని అన్నారు. శ్రీ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ ఈ సమావేశంలో నిపుణులు వెలిబుచ్చిన అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రిగారికి నివేదిస్తామని చెప్పారు. శ్రీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ తమ



మల్కాజిగిరి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో మూసీ బాధితులు ఉన్నారని, వారి ఆక్రందనలు, సమస్యలకు సరైన పరిష్కారం చూపించిన తరువాతనే ప్రభుత్వం మూసీపై గానీ, హైడ్రాపై గానీ ముందుకు సాగాలని, ప్రజల సంక్షేమాన్ని ఉద్దేశించని ఏ అభివృద్ధి అయినా వ్యర్థమేనని అన్నారు. శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ నిర్వాసితుల పునరావాసం, సరైన నష్టపరిహారం, వివిధ ప్రజా సంఘాలు లేవనెత్తిన సందేహాల నివృత్తి అనంతరమే ప్రభుత్వం మూసీ ప్రాజెక్టును చేపట్టాలని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ గారు మాట్లాడుతూ తన చిన్నతనంలో నడుము దాకా మూసీలో నీళ్లు ఉండేవని, ఇప్పుడు పారిశ్రామిక వ్యర్థాలు, డ్రైనేజీ నీరు తప్ప మూసీలో ప్రవాహమే లేదని అన్నారు. పారిశ్రామిక వ్యర్థాలను అరికట్టడం, మరిన్ని ఎస్టీపీ ప్లాంట్లు ఏర్పాటు చేసి మూసీని శుద్ధి చేయడం, డ్రైనేజీ ఇన్ ను అడ్డుకోవడం, క్యాచ్మెంట్ ఏరియాను పునరుద్ధరించడం, నిర్వాసితులకు పునరావాసం కల్పించడం వంటి అంశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని సూచించారు. ఇటీవల కాలంలో టీఆర్ఎల్డీ నిర్వహించిన

ఫ్యూచర్ సిటీ, హైడ్రా మరియు మూసీ పునరుద్ధరణ అంశాలపై వివిధ వర్గాల అభిప్రాయాలను క్రోడీకరించి ముఖ్యమంత్రిగారిని నివేదికలతో కలిసి కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి (ఉపాధ్యక్షులు, టీఆర్ఎల్డీ), బీరప్ప (ప్రవక్త), విశాల్ (ప్రధాన కార్యదర్శి), ఓంకార్ (కార్యదర్శి), నరసింహారావు (ప్రధాన కార్యదర్శి), రిషభ్ జైన్ (ప్రధాన కార్యదర్శి), గిరి కుందే (కోశాధికారి), బుల్లెట్ వెంకన్న, రాజకుమార్ (రాష్ట్ర యువజన అధ్యక్షులు), కోటేశ్వర్, శ్రీనివాస్, విక్రమ్, బేగ్, కిరణ్, మల్లేష్ గౌడ్, మాడు సత్యం గౌడ్, శ్రీ కర్నాటి మనోహర్, రాంప్రసాద్ (వరంగల్ జిల్లా అధ్యక్షులు), జనగాం జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి తదితర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ప్రముఖ సామాజికవేత్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు హాజరయ్యారు.

# 15 ఏళ్ల తర్వాత కలిసిన ఎన్ఎఫ్‌సీ విశ్రాంత ఉద్యోగులు

### జ్ఞాపకాల సందడిలో ఆత్మీయ సమ్మేళనం

**సికింద్రాబాద్ జులై 11 (వన్‌నేషన్):** న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ) ఈఎఫ్ఎఫ్‌పీ/క్యూసీ విభాగానికి చెందిన విశ్రాంత ఉద్యోగులు 15 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని పారడైజ్ సర్కిల్ సమీపంలోని సంతోష్ ధాబాలో జరిగిన ఈ కార్యక్రమంలో 30 మంది విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.







ఉద్యోగ జీవితంలో కలిసి పనిచేసిన రోజులను గుర్తు చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పరం కుటుంబ విశేషాలను పంచుకుంటూ ఆప్యాయంగా గడిపారు. ఎన్నో ఏళ్ల అనంతరం సహోద్యోగులను కలుసుకోవడం ఆనందంగా ఉందని సభ్యులు పేర్కొన్నారు. ఇలాంటి సమావేశాలు స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని శ్రీ ఎన్. భరత్ రాజ్, పి. సాయిబాబా, ఎస్. రవిచంద్రన్, బి.ఎం.ఎస్. అశోక్ కుమార్, కె. ఎల్లయ్యలతో కూడిన నిర్వహణ కమిటీ విజయవంతంగా నిర్వహించింది.

# అక్షరాల సాక్షిగా అరుణ్ అన్న నిస్వార్థ సేవ

**- నా సోదరి సానియా డాక్టర్ కలలకు అభయహస్తం - సుమేర్ (సానియా సోదరుడు)**



హైదరాబాద్, జులై 11 (వన్‌నేషన్): సమాజంలో నిశ్శబ్దంగా సాగే కొన్ని సేవా ప్రస్థానాలు ఏ రకమైన ప్రచార ఆర్భాటాలు లేకపోయినా, ఎందరో నిరుపేద జీవితాలలో వెలుగులు నింపుతాయి. అలాంటి ఒక మహోన్నతమైన నిస్వార్థ సేవా మూర్తి, నిజమైన నాయకుడు అరుణ్ అన్న యొక్క ఆచరణాత్మక జీవన విధానం గురించి నా గుండె లోతుల్లోంచి ఉప్పొంగుతున్న కృతజ్ఞతతో రాస్తున్న అక్షర సత్యాలు ఇవి.

మా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో, దినదిన గండంగా బతుకుతున్న తరుణంలో, రూపాయి కూడా లేక నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వేళ మాకు కొండంత అండగా నిలబడ్డారు అరుణ్ అన్న. భవిష్యత్తులో నా సోదరి సానియా ఒక గొప్ప డాక్టర్ కావాలనే ఉన్నతమైన ఆశయంతో, ఆమెను ఉన్నత చదువుల వైపు నడిపించడానికి అరుణ్ అన్నానే స్వయంగా మార్గదర్శకత్వం వహించి, ఆమెను Bi.P.C గ్రూప్‌లో జాయిన్ చేయించారు. సానియా ఇప్పుడే తన ఇంటర్మీడియట్ విద్యాభ్యాసంలో అడుగుపెడుతున్న తరుణంలోనే, కేవలం ఏదో ఒక డిగ్రీ చదవడమే కాకుండా అపారమైన జ్ఞానాన్ని సంపాదించి సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో అన్న ఈ అడుగు వేశారు.

ఆమె ఉన్నత చదువుల బాధ్యతను, డాక్టర్ కలలను పూర్తి చేయించే బాధ్యతను అన్న తన భుజాలపై వేసుకున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఆమె వసతి మరియు ట్యూషన్ ఫీజుల కొరకు మేము అడగకుండానే 86,000 అందించి, మా కళ్ళల్లో ఆనందాన్ని చూసిన మహానుభావుడు అరుణ్ అన్న. ఒక ఆడపిల్ల డాక్టర్ చదువుకు ఇంటర్మీడియట్ తొలి అడుగుల నుండే అండగా నిలబడటం అంటే కేవలం ఒక జీవితానికి సహాయం చేయడం కాదు, సమాజానికి ఒక ప్రాణదాతను అందించడానికి పునాది వేయడం. ఆపత్కాలంలో మాకు అండగా నిలిచి, సానియా ఇంటర్మీడియట్ ప్రారంభ ప్రయాణానికి బాసటగా నిలుస్తూ, ఆమెను దీక్షా.జ లో చేర్పించి డాక్టర్ కలల వైపు నడిపిస్తున్న నిజమైన నాయకుడు అరుణ్ అన్నకి మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా సాగుతున్న అన్న యొక్క ఈ నిస్వార్థ ప్రస్థానం మరెందరో యువకులకు ఆదర్శ ప్రాయం, ఒక నిరంతర ప్రేరణ.

## ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు

# కనీస వేతనం 26,000 ఇవ్వాలి : సిఐటియు




ఎమ్మిగనూరు జులై 11 (వన్‌నేషన్): ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 26000 ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజి బాబు , ఎమ్మిగనూరు మండల అధ్యక్ష కార్యదర్శులు పి గోవిందు బి రాముడు డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మిగనూరు మండల సిఐటియు కార్యకర్తల విస్తృత సమావేశం సిఐటియు ఆఫీసు నందు కామ్రేడ్ పి గోవిందు అధ్యక్షతన జరిగింది .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజి బాబు ఎమ్మిగనూరు మండల అధ్యక్ష కార్యదర్శులు పి గోవిందు బి రాముడు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో 15 సంవత్సరముల నుండి ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికులకు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు స్కీం వర్కర్లకు నేటికీ కనీస వేతనం గెజిట్ ఇవ్వకపోవడం చాలా విచారకరమన్నారు. కర్ణాటక రాష్ట్రంలో రాజస్థాన్ రాష్ట్రంలో గుజరాత్ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలలో కార్మికులు ఉద్యమ ఫలితంగా వేతనాలు పెంచారని తెలిపారు. కాబట్టి ప్రస్తుత ధరలు పెరగడం వల్ల దీనికి తగ్గట్టు కనీస వేతనాలు కార్మికులకు 26 వేల రూపాయలు ఇవ్వాలని అలాగే షెడ్యూల్ సంస్థల యజమానులతో కనీస వేతనాలు ఇప్పించాలని జూలై 30 మరియు 31వ తేదీ రెండు రోజులపాటు కర్నూలు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ఆందోళనకు సిద్ధం కా వాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పట్టణ సిఐటియు నాయకులు ఏ సురేష్, జె నాగరాజు , కే వెంకటేశులు, ఈ రంగన్న గౌడ్, కే కాజా, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి శివలక్ష్మి, ఎం లక్ష్మన్న, కే కాజా, బి గోపాల్, బి రంగన్న ,శాంతిరాజు, పల్లవి ,రాజు తదితరులు పాల్గొన్నారు

# ఎస్. జానకమ్మ కన్నుమూత

(1వ పేజీ తరువాయి)

ఉన్నాము. ప్రపంచానికి ఆమె ఎన్నో జ్ఞాపకాలలో భాగమైన ఒక ఐకానిక్ వాయిస్ కావచ్చు, కానీ మాకు మాత్రం ఎంతో ఆప్యాయత, వినయం, దయ, హుందాతనం కలిగిన ఒక ప్రియమైన అమ్మమ్మ. ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ మాతోనే ఉంటాయి. మేము ఈ పెద్ద లోటును తట్టుకుని, తీవ్ర బాధలో ఉన్న ఈ కష్టసమయంలో మా కుటుంబానికి కావలసిన ప్రైవసీని గౌరవించాలని అందరినీ కోరుతున్నాము. మమ్మల్ని అర్థం చేసుకున్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అంటూ తెలిపారు. ఇక ఈ వార్త విన్న సినీ పరిశ్రమ, సంగీత అభిమానులు ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. జానకి మరణంతో టాలీవుడ్‌తో పాటు మొత్తం దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఒక శకం ముగిసినట్లయింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ నెటిజన్లు, సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు

# బీఆర్ఎస్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయి

(1వ పేజీ తరువాయి)

పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ (బీఆర్ఎస్) కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు.

# ఎంఈఓ ను సన్మానించిన టి యు టి ఎఫ్, నాయకులు



యాదాద్రి జిల్లా: రామన్నపేట జులై 11 (వన్ నేషన్) : రామన్నపేట మండల నూతన విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ తంగెళ్ళ సురేందర్ రెడ్డిని,టి యు టి ఎఫ్ రామన్నపేట మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యా వ్యవస్థ బలోపేతం కావడం లో విద్యాశాఖకు, ఎంఈఓ కి, టి యు టి ఎఫ్, పక్షాన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వల్లమల భాస్కర్, ఉయ్యాల భిక్షమయ్య, పాల్వంచ హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.


# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై మీడియా సమావేశం




బాలాపూర్ జులై 11 (వన్ నేషన్) : బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై మీడియా సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రస్తుతం కొనసాగుతున్న సర్ --2026 కార్యక్రమ పురోగతిని మీడియాకు వివరించారు. ఓటరు జాబితాను సంపూర్ణంగా, ఖచ్చితంగా రూపొందించే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. బడంగ్‌పేట్ AERO పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని పూరించడంలో ఏవైనా సందేహాలు ఉన్నా, లేదా 2003 నాటి ఓటరు జాబితాకు సంబంధించిన వివరాలను తెలుసుకోవాల్సి వచ్చినా, ఆయా హెల్ప్‌డెస్క్‌లలో అధికారులు మరియు వాలంటీర్లు అవసరమైన సహాయాన్ని అందిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా పూరించి, సంబంధిత పోలింగ్ బూత్ స్థాయి అధికారి (BLO)కి జూలై 24లోగా తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. గడువులోగా ఫారం సమర్పించని పక్షంలో, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వారి ఓటరు నమోదుపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. సర్--2026 కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వాములు అయ్యేలా మీడియా తమ వంతు సహకారం అందించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం--50, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జగదీశ్వర్ రెడ్డి, బడంగ్‌పేట్ సర్కిల్--16 డిప్యూటీ కమిషనర్ / AERO సమ్మయ్య, మహేశ్వరం నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నరేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశాల్ పెరిఫెరల్స్ ఆధ్వర్యంలో 'బియాండ్ ది స్పాట్‌లైట్' ప్రారంభం



హైదరాబాద్, జులై 11 (వన్‌నేషన్): టెక్నాలజీ, గేమింగ్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లను ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో విశాల్ పెరిఫెరల్స్ 'బియాండ్ ది స్పాట్‌లైట్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రముఖ నటుడు, కొరియోగ్రాఫర్ సల్మాన్ యూసుఫ్ ఖాన్ ఈ షోకు హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో టెక్ నిపుణులు, గేమింగ్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'బియాండ్ ది స్పాట్‌లైట్ బెస్ట్ రీల్' విజేతలకు విశాల్ పెరిఫెరల్స్ ఎండీ వికాస్ హిసారియా, సల్మాన్ యూసుఫ్ ఖాన్ అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం వికాస్ హిసారియా మాట్లాడుతూ... సృజనాత్మకత, సాంకేతికతకు ఈ వేదిక వారధిగా నిలుస్తుందని తెలిపారు. సల్మాన్ యూసుఫ్ ఖాన్ మాట్లాడుతూ.... హైదరాబాద్‌లో తన కొత్త షోను ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఈ కార్యక్రమం ప్రేక్షకాదరణ పొందుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

# కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించిన బాణా నాగేశ్వర్ రెడ్డి



తాడిపత్రి, జులై 11 (వన్‌నేషన్): అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లె లోని బాణా సూర్యనారాయణ రెడ్డి కుమారుని నిశ్చితార్థ ఆహ్వానం మేరకు శ్రీ పద్మావతి కన్వెన్షన్ హాల్ లో నవీన్ రెడ్డి, కల్పన ఎంగేజ్మెంట్ కి హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆంధ్రప్రదేశ్ హిందుస్థాన్ స్కౌట్స్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్ రెడ్డి, ఆయనతోపాటు ఆర్.టి.ఐ జిల్లా పూర్వ ఉపాధ్యక్షులు కోడేగంటి నబి రసూల్, బాణా సూర్యనారాయణ రెడ్డి.

# అఖిల్ ప్రాంక్ కాల్..
# అవతలి వ్యక్తి రివర్స్ పంచ్‌లు

అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ జంటగా నటించిన తాజా చిత్రం లెనిన్. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా జులై 10న విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా అఖిల్ ప్రాంక్ కాల్ చేశారు. తాను అఖిల్‌ను మాట్లాడుతున్నానని చెబితే,, అవతలి వ్యక్తి 'నేను నాగార్జునను మాట్లాడుతున్నా' అంటూ రివర్స్ పంచ్‌లు వేయడం గమనార్హం.

# ‘జన నాయగన్’ సెన్సార్ పూర్తి

తమిళనాడు సీఎం విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కథానాయకుడిగా నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' ఎట్టకేలకు సెన్సార్ పూర్తి చేసుకుంది. సీబీఎఫ్‌సీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్) ఈ మూవీకి 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చింది. సినిమా నిడివి 183 నిమిషాలుగా (3 గంటల మూడు నిమిషాలు) ఖరారైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో పూజా హెగ్డే కథానాయిక. మమిత బైజు, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషించారు. ఈ ఏడాది సంక్రాంతికి రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్యల కారణంగా విడుదలకు నోచుకోలేదు. కోర్టు కేసులు, సుదీర్ఘ వాయిదాల తర్వాత ఎట్టకేలకు 'జన నాయగన్' విడుదలకు మార్గం సుగమమైంది. జులై 24న ఈ మూవీని విడుదల చేయాలని చిత్ర బృంద భావిస్తోంది. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



# అలాంటివి ఆశిస్తే.. నా ఇన్‌స్టా సబ్‌స్క్రైబ్ చేసుకోవద్దు

కొన్ని రోజులుగా సెలబ్రిటీల ఇన్‌స్టా సబ్‌స్క్రిప్షన్ హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. తాజాగా నటి పాయల్ రాజ్ పుత్ కూడా తన అకౌంట్‌కు సబ్‌స్క్రిప్షన్ పెట్టారు. దీంతో ఆమెను కొందరు ట్రోల్ చేశారు. వారికి సమాధానమిస్తూ పాయల్ పోస్ట్ చేశారు. తన సబ్‌స్క్రిప్షన్ ఛానల్‌లో ఎలాంటి కంటెంట్ ఉండనుందో స్పష్టం చేశారు. 'హాట్ పిక్స్', బోల్డ్ కంటెంట్ కోసం ఆశించే వారెవరూ తన ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవద్దని చెప్పారు.

"నా ఛానల్‌లో నేను ఎలాంటి కంటెంట్ షేర్ చేయబోతున్నాననే దానిపై చాలా మంది మెసేజ్‌లు చేస్తున్నారు. నేను ఒక విషయం చాలా స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. ఒకవేళ మీరు బోల్డ్ కంటెంట్ ఆశించి సబ్‌స్క్రైబ్ చేసుకోవాలనుకుంటే.. మీకు ఇది సరైన ఛానల్ కాదు. తెర వెనుక ఉండే నా నిజమైన జీవితాన్ని చూడాలనుకునే వాళ్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ చేసుకోండి. నా వ్యక్తిగత పరిధిని గౌరవిస్తున్నందుకు ధన్యవాదాలు" అని పాయల్ పేర్కొన్నారు. ఇందులో తన అభిప్రాయాలు మాత్రమే ఉంటాయని.. అంతకు మించి మరేమీ ఆశించవద్దని ఆమె స్పష్టం చేశారు.





# మనకై.. మనమై జీవిద్దాం...

సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'టాక్సిక్' మీదనే. యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కథానాయికలు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచాయి. తాజాగా ఈ చిత్రంలోని 'తబాహీ..' అనే గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. "లోకం సంకెళ్లు తెంచేద్దాం.. కాలం పరదాలు కాల్చేద్దాం. మనకై మనమై జీవిద్దాం.." అంటూ సాగుతోంది గీతం. రామజోగయ్య శాస్త్రి దీనికి సాహిత్యమందించారు. వెంకట్ కె.నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న థియేటర్లలోకి రానుంది.

# మా నిర్ణయాలపై ఎవరి ప్రభావం ఉండదు:
# అర్జెంటీనాఈజిప్ట్ మ్యాచ్ వివాదంపై ఫిఫా

ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లో అర్జెంటీనా - ఈజిప్ట్ మ్యాచ్ తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈజిప్ట్ ప్లేయర్ 59వ నిమిషంలో గోల్ కొట్టినప్పటికీ.. దానిని ఫౌల్‌గా ప్రకటించడం తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అర్జెంటీనాకు అనుకూలంగా ఫిఫా మారిపోయిందని ఈజిప్ట్ విమర్శలు చేసింది. లియోనెల్ మెస్సిని ప్రపంచ కప్‌లో ఆడించాలనేదే నిర్వాహకుల ఉద్దేశమని ఈజిప్ట్ కోచ్ సంచలన ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో ఫిఫా రిఫరింగ్ చీఫ్ కొల్లినా స్పందించారు. తమ సమగ్రత విషయంలో ఎవరి జోక్యం ఉండదని స్పష్టం చేశారు.

"ఇప్పటి వరకు టోర్నీ జరుగుతున్న తీరుతో మేం సంతోషంగా ఉన్నాం. ఇంత తక్కువ సమయంలో ఎక్కువ మ్యాచులు ఆడినప్పుడు అన్నీ మనం అనుకున్నట్లుగా జరగకపోవడం సహజమే. అలా జరిగినప్పుడు తదుపరి మ్యాచ్‌కు పూర్తిగా సిద్ధంగా ఉండేలా చూసుకోవడానికి మరింత కష్టపడతారు. ఏదైనా నిర్ణయంపై నిర్మాణాత్మక చర్చ మంచే చేస్తుంది. ఫుట్‌బాల్ క్రీడలో అదొక భాగం. కానీ, నిరాధార ఆరోపణలకు ఇక్కడ చోటు లేదు. ఫిఫా ప్రపంచ కప్ మ్యాచుల అధికారుల సమగ్రతను ఎవరూ ప్రశ్నించలేం. ఎందుకంటే ఇది వారికి, వారి కుటుంబ సభ్యులకు బెదిరింపులు దారితీసే ప్రతిచర్యలకు రేకెత్తే అవకాశం ఉంది. అది సరైన పద్ధతి కాదు. ఫిఫా రిఫరింగ్ వ్యవస్థపై బయట నుంచి ఎవరి ప్రభావం ఉండదు. ఫిఫా ప్రెసిడెంట్ గియాన్ని కూడా ప్రభావితం చేయలేరు. ఫిఫా టీమ్‌పై ఆయనకు పూర్తి నమ్మకం ఉంది. అధికారులు నిజాయతీగా నిర్ణయాలు తీసుకుంటారు. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు" అని వెల్లడించారు.




# రంగారెడ్డి రైజర్స్ ఔట్..
# క్వాలిఫయర్-2కు కరీంనగర్ డైమండ్స్




టీజీ20 లీగ్ 2026లో కరీంనగర్ డైమండ్స్ క్వాలిఫయర్-2కు అర్హత సాధించింది. గురువారం రంగారెడ్డి రైజర్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కరీంనగర్ 75 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో రంగారెడ్డి 16.3 ఓవర్లకు 163 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్, ఓపెనర్ తనయ్ త్యాగరాజన్ (63; 33 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), నితిన్ సాయి యాదవ్ (50; 30 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకాలు చేశారు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. కరీంనగర్ బౌలర్లలో ఆశిశ్ శ్రీవాత్సవ (5/16) అద్భుతమైన ప్రదర్శన చేశాడు. శుభమ్ శర్మ 2, నారాయణ తేజ, సతీశ్ కుమార్, దినేశ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. నేడు క్వాలిఫయర్-1 హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్, ఖమ్మం ఏఎస్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టుతో కరీంనగర్ రేపు క్వాలిఫయర్-2 ఆడనుంది.

క్వాలిఫయర్‌కు అర్హత సాధించేందుకు చేరువగా ఉంది. రంగారెడ్డి రైజర్స్‌తో మ్యాచ్‌లో విజయం దిశగా సాగుతోంది. కరీంనగర్ నిర్దేశించిన 239 పరుగుల లక్ష్య ఛేదనలో రంగారెడ్డి ప్రస్తుతం 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. ఇంకా ఆ జట్టు విజయానికి 30 బంతుల్లో 92 పరుగులు అవసరం. క్రీజ్‌లో ఆర్యన్ (2*), నితిన్ (41*) ఉన్నారు.

ఇప్పటి వరకు దూకుడుగా ఆడిన రంగారెడ్డి రైజర్స్ కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ (63) పెవిలియన్‌కు చేరాడు. చేయాల్సిన రన్‌రేట్ పెరిగిపోవడంతో వేగంగా ఆడేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో శుభమ్ శర్మ బౌలింగ్‌లో (11.2వ ఓవర్) తనయ్ భారీ షాట్‌కు యత్నించాడు. అయితే, తనయ్ బౌండరీ లైన్ వద్ద సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ సంకోజ్ చేతికి చిక్కాడు. దీంతో ఆరో వికెట్‌ను రంగారెడ్డి కోల్పోయి కష్టాల్లో పడింది. ప్రస్తుతం 12 ఓవర్లకు రంగారెడ్డి స్కోరు 126/6. క్రీజ్‌లో హితేశ్ (2*), నితిన్ (25*) ఉన్నారు. రంగారెడ్డి విజయానికి ఇంకా 48 బంతుల్లో 113 పరుగులు అవసరం.

రంగారెడ్డి ఇప్పటికే సగం వికెట్లను చేజార్చుకుంది. అయితే, కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ (60*) హాఫ్ సెంచరీతో జట్టును నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. కేవలం 26 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. ప్రస్తుతం రంగారెడ్డి స్కోరు 10 ఓవర్లకు 109/5. క్రీజ్‌లో తనయ్‌తోపాటు నితిన్ (14*) ఉన్నారు. రంగారెడ్డి విజయానికి 60 బంతుల్లో 130 పరుగులు అవసరం.

కరీంనగర్‌తో ఎలిమినేటర్‌లో రంగారెడ్డి రైజర్స్‌కు భారీ షాక్ తగిలింది. పవర్ ప్లేలో కాస్త దూకుడు ప్రదర్శించిన ఆ జట్టు ఆ తర్వాత ఒకే ఓవర్‌లో రెండు వికెట్లను కోల్పోయింది. ఆశిష్ శ్రీవాస్తవ్ వేసిన ఏడో ఓవర్ రెండో బంతికి ఆదిత్య జవ్వాజి (17).. ఐదో బంతికి జ్ఞాన రెడ్డి (1) స్టంపౌట్ అయ్యారు. రాదేశ్ అద్భుతమైన నైపుణ్యంతో స్టంపింగ్ చేశాడు. ప్రస్తుతం రంగారెడ్డి స్కోరు 7 ఓవర్లకు 75/4. క్రీజ్‌లో వెంకట్ (1*), తనయ్ త్యాగరాజన్(40*) ఉన్నారు. రంగారెడ్డి విజయానికి ఇంకా 78 బంతుల్లో 164 పరుగులు అవసరం.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ,** RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**